MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

GHMC hmda Growing Global TS-bPASS

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 06-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# మంథని నియోజకవర్గానికి రూ.12.58 కోట్ల నిధులు

- ౦ గామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- ౦ మంథని నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు
- ౦ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద అభివృద్ధి పనులకు ఆమోదం
- ౦ మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

5



# పటాన్‌చెరు అభివృద్ధికి ప్రభుత్వ భూములు కేటాయించాలి

- ౦ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ౦ నూతన సబ్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించాలి
- ౦ ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలు ఇవ్వాలి
- ౦ కొల్లూరు మిగులు భూమిని స్థానిక అవసరాలకే వినియోగించాలి
- ౦ అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలి
- ౦ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్

4



# నిన్న ప్రశ్నలు.. నేడు తనిఖీలు..!!



## అంగన్‌వాడీ కేంద్రాల్లో అధికారుల తనిఖీలు

- క్రైమ్ మిర్రర్ కథనంపై స్పందించిన అధికారులు
- కేంద్రాలను పరిశీలించిన సూపర్వైజర్ రమ
- తనిఖీ వివరాలు అడిగిన బీజేపీ మండల ఉపాధ్యక్షులు సూరం మహేష్
- నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన



క్రైమ్ మిర్రర్ ఎఫెక్ట్

సూరారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం నాణ్యత, పిల్లలకు అందుతున్న ఆహారం విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందన్న ఆరోపణలపై క్రైమ్ మిర్రర్‌లో వెలువడిన కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది. కథనం నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్వైజర్ రమ పరిశీలించి పరిస్థితులను తెలుసుకున్నారు. కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, గుడ్ల పంపిణీ, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు తెలిసింది. పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించినట్లు సమాచారం.

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**




పౌష్టికాహారమే పిల్లల భవిష్యత్తు...



"నాణ్యమైన ఆహారం, పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలి"
– అధికారి సూచిన

2

# నిన్న ప్రశ్నలు.. నేడు తనిఖీలు..!!

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సందర్భంగా బీజేపీ మహాదేవపూర్ మండల ఉపాధ్యక్షులు సూరం మహేష్ సూపర్వైజర్ రమను కలిసి తనిఖీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో వాస్తవ పరిస్థితులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, గుడ్ల నాణ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకోవాలని కోరారు. పిల్లల ఆరోగ్యంతో ముడిపడిన పౌష్టికాహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందుతున్న ఆహారంపై తల్లిదండ్రులకు ఎలాంటి అనుమానాలు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.




లోపాలు ఉంటే సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

**క్రైమ్ మిర్రర్ కథనంపై అధికారుల స్పందన**

సూరారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితులపై క్రైమ్ మిర్రర్ ప్రచురించిన కథనం అనంతరం అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, మీడియా ద్వారా వెలుగులోకి వచ్చే సమస్యలను అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం అందించే కీలక కేంద్రాలు కావడంతో వాటి నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రత, పిల్లల ఆరోగ్యం వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ఒక్కసారి తనిఖీతో కాకుండా అన్ని కేంద్రాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి

**అన్ని కేంద్రాల్లోనూ తనిఖీలు జరగాలి**

సూరారం పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సమగ్రంగా తనిఖీ చేసి, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, పంపిణీ తీరును అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. క్రైమ్ మిర్రర్ కథనం తర్వాత అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమని, ఇకపై కూడా ఇదే విధంగా ప్రజల సమస్యలపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సౌజన్యను సర్పంచ్‌గా గెలిపించింది నేనే

**నా ఎదుగుదలను చూసి ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు**

**తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్**

**యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం:** అల్లందేవి చెరువు గ్రామ సర్పంచ్ సౌజన్య ని సర్పంచ్‌గా గెలిపించేందుకు తాను కీలకంగా పనిచేశానని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో సర్పంచ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నేపథ్యంలో, సర్పంచులపై వేధింపులు ఉండకూడదని, ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని తాను బహిరంగంగా హెచ్చరించానని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని తట్టుకోలేక తనపై రాజకీయంగా ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ జిల్లా నాయకుడు బచ్చలబోయిన దేవేందర్ యాదవ్ తనపై చేసిన విమర్శలను సుర్వి యాదయ్య గౌడ్ ఖండించారు. గ్రామంలో జరిగిన సంఘటనకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకోవాలంటే పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సభ్యులు, గ్రామ సభలో పాల్గొన్న వ్యక్తుల నుంచి పూర్తి వివరాలను సేకరించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా సర్పంచ్ సౌజన్యను ఎవరైనా దూషించినట్లు విచారణలో తేలితే, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుర్వి యాదయ్య గౌడ్ కోరారు.



తన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది తనపై తప్పుడు ప్రకటనలు చేయడం సరికాదని అన్నారు. ఇలాంటి ఆరోపణలను ప్రజలు సహించరని తెలిపారు. అల్లందేవి చెరువు గ్రామంలో ప్రజలంతా కలిసిమెలిసి ప్రశాంతంగా ఉండాలని, రాజకీయ ప్రయోజనాల కోసం గ్రామస్తుల మధ్య తగాదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తే ప్రజలు తగిన విధంగా స్పందిస్తారని సుర్వి యాదయ్య గౌడ్ హెచ్చరించారు. గ్రామంలో జరిగిన వాస్తవాలను విచారణ ద్వారా వెలుగులోకి తీసుకురావాలి --- రాజకీయ ఆరోపణలకు తావు లేకుండా నిజానిజాలు ప్రజలకు తెలియాలి అని ఆయన అన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం సీజ్.. దాని విలువ ఎంతంటే..!

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భారీగా బంగారాన్ని సీజ్ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఈ బంగారాన్ని పట్టుకున్నారు. ఇవాళ (సోమవారం) అనుమానాస్పదంగా కనిపించిన ఓ ప్రయాణికుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. అతని దగ్గర సుమారు 800 గ్రాముల బంగారం దొరికింది. పట్టుబడ్డ బంగారం విలువ దాదాపు రూ.1.20 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఓ వ్యక్తి అక్రమంగా బంగారాన్ని తీసుకుని శంషాబాద్ విమానాశ్రయానికి వస్తున్నాడన్న పక్కా సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ నిర్వహించారు. తిరుచ్చిరాపల్లి నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హైదరాబాద్‌కు చెందిన నగల వ్యాపారిగా గుర్తించారు. అతని లగేజీని తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. ముందుగా కస్టమ్స్ అధికారులు సాధారణ తనిఖీల్లోనే ఈ బంగారాన్ని గుర్తించారు. అనంతరం ప్రయాణికుడిని విచారణ కోసం డీఆర్ఐ అధికారులకు అప్పగించారు.




# అంజయ్యనగర్ పార్కు కబ్జాపై సీఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు...

**ప్రజావాణిలో 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి వినతి....**

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** అంజయ్యనగర్ సర్వే నెం. 134, 136 లోని 1 ఎకరా 20 గుంటల పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని, వెంటనే చర్యలు తీసుకుని పార్కును కాపాడాలని కోరుతూ 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి సీఎంసీ కమిషనర్ సృజన గారికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్యనగర్, సిద్దిఖ్ నగర్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన కమిషనర్ సృజన పార్కుల కబ్జాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ "యూస్ లెస్ ఫెల్లోస్ ఏం చేస్తున్నారు, ఈరోజు ఇది రెండో ఫిర్యాదు" అని మండిపడ్డారు. పార్కు కబ్జాపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని 'జనం కోసం' సంస్థకు హామీ ఇచ్చారు.

# రూ.4 లక్షలు లంచం.. ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్..!

రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దాడుల్లో వరసగా అక్రమార్కులు పట్టుబడుతున్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న స్వర్ణకుమారి (ఘ్రుఖీతీఖు ఖఱఖ్రుతీఱు) లక్ష రూపాయల లంచం తీసుకున్న ఘటన మరవకముందే టౌన్ ప్లానింగ్ అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడింది. జీహెచ్ఎంసీ గోల్కొండ జోన్‌లో పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా సేవలందిస్తున్న తులసీరాం సునీత రూ.4 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికింది. అవినీతి నిరోధక శాఖ వరసగా జరుపుతున్న దాడుల్లో మరో ప్రభుత్వ అధికారిని పట్టుబడింది. జీహెచ్ఎంసీ గోల్కొండ జోన్‌లో పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా సేవలందిస్తున్న తులసీరాం సునీత రూ.4 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికింది. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అదేశాలను బేఖాతరు చేస్తూ.. భవన నిర్మాణదారుడికి అధికారికంగా లబ్ది చేకూర్చడం కోసం రూ.8 లక్షలు లంచం డిమాండ్ చేసింది సునీత. సోమవారం ఫిర్యాదుదారు నుంచి నాలుగు లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. సునీత ఆఫీసులో సోదాలు చేయగా లభించిన రూ.2.5లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడిన సునీతను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఆమెను నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపరిచారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున.. భద్రత కారణాలరీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని ఏసీబీ పేర్కొంది.



## మహిళ వీఓఏ పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**కల్వకుర్తి వివోఏ ల డిమాండ్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** గాంధీ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీ.కా మల్లెపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో వీఓఏగా పనిచేస్తున్న మాధవిపై మాజీ సర్పంచ్ భర్త అమర్నాథ్ గౌడ్ దాడి చేశారని ఆరోపిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా ఐకేపీ వీఓఏల సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సభలో మాధవిని అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, కులం పేరుతో దూషిస్తూ చేయి చేసుకున్నారని వారు ఆరోపించారు. విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ఉద్యోగిపై దాడి చేయడం బాధాకరమని, ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఐకేపీ వీఓఏల సంఘం కోశాధికారి వి. దేవయ్య డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండల సిబ్బంది సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి రాణి, మమత, స్వప్న, కవిత, వీరస్వామి, వెంకటమ్మ, సైదులు, రజత తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తిలో పశువుల దొంగతనాల ముఠా అరెస్ట్

**నలుగురు నిందితుల పట్టివేత.. రూ.లక్ష నగదు, టాటా ఏస్ ఆటో స్వాధీనం**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం, పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న నంద్యాల జిల్లా ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై కురుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితులను దేగ పుల్లయ్య, పగ్గాల రాముడు, యమ్మని చంద్ర, ఎండీ ఇబ్రహీంగా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.1 లక్ష నగదు, ఒక టాటా ఏస్ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువుల దొంగతనాలకు సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కల్వకుర్తి మండలం, పరిసర ప్రాంతాల్లో పశువుల దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సమాచారం.




# ప్రజావాణి కార్యక్రమంలో 54 దరఖాస్తులు

**ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి**

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం కలిసి ప్రజల నుంచి 54 దరఖాస్తులు, స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచనలు చేస్తూ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కరించిన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారునికి సమాచారం అందించడంతో పాటు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిపక్షంలో సంబంధిత శాఖకు లేఖ ద్వారా పంపించాలని తెలిపారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కరించలేమో ఫిర్యాదుదారునికి స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి, ప్రజావాణి కార్యక్రమాల ద్వారా అందిన పెండింగ్ అర్జీలను కూడా సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో డ్రోన్ సేవలు

**స్వల్ప అద్దెకే మందుల పిచికారీ.. సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** రైతులకు వ్యవసాయ పనుల్లో మరింత సౌకర్యం కల్పించేందుకు ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల పరిధిలోని పరిసర గ్రామాల రైతులు ఈ సేవలను స్వల్ప అద్దెకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. సోమవారం ఆమనగల్లు సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన డ్రోన్‌ను గంప వెంకటేష్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రసాయన ఎరువులు, మందుల పిచికారీ కోసం డ్రోన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా గంటకు సుమారు రెండు నుంచి మూడు ఎకరాల వరకు మందులు పిచికారీ చేయవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సింగిల్ విండో ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను అందిస్తున్నామని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం సింగిల్ విండో అహర్నిశలు కృషి చేస్తోందని, రైతులు అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు ఎనుముల జంగమ్మ, దావ శ్రీపాల్, చేగిరి వెంకటేష్, బెయిలి వెంకటయ్య, జోగు వీరయ్య, కౌన్సిలర్ ఎనుముల రమేష్, సీఈవో పద్మాకర్ రెడ్డి, సిబ్బంది దేవేందర్, అల్లాజీ, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీలింగ్ భూమి ఆక్రమణపై ప్రజావాణిలో ఫిర్యాదు

**రైతుల భూమిని కబ్జా చేసి ఫెన్సింగ్ చేశారని ఆరోపణ.. చర్యలు తీసుకోవాలని వినతి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి తలకొండపల్లి:** తలకొండపల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కోరింతకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని సీలింగ్ భూమి ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని 142 సర్వే నంబర్‌లో ఉన్న సీలింగ్ భూమిలో సుమారు ఎకరం భూమిని దాస్యం మాధవి, దేవరకొండ ధర్మపట్టి విమలావతి అనే ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. రైతులకు చెందిన భూమిని ఆక్రమించి, వారిపై ఒత్తిడి చేస్తూ అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, భూమి ఆక్రమణకు పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు న్యాయం చేసి, సీలింగ్ భూములను పరిరక్షించాలని వారు అధికారులను కోరారు.

# హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన కల్వకుర్తి బీఆర్ఎస్వీ నాయకులు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను ప్రోత్సహించాలని, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అండగా నిలవాలని నాయకులు చర్చించారు. యువతకు అన్ని విధాలుగా సహకరిస్తామని హరీష్ రావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యా సంస్థలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని బీఆర్ఎస్వీ నాయకులు పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు బాధ్యతాయుతంగా, నిజాయితీగా పనిచేసేలా ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్వీ యువ నాయకుడు తరుణ్ రాథోడ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం న్యాయంగా, నిజాయితీగా నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్వీ యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పటాన్‌చెరు అభివృద్ధికి ప్రభుత్వ భూములు కేటాయించాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నూతన సబ్‌స్టేషన్లకు స్థలాలు కేటాయించాలి
- కొల్లూరు మిగులు భూమిని స్థానిక అవసరాలకే వినియోగించాలి
- అర్హులైన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలి
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్
- ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్‌కు 2 ఎకరాలు ఇవ్వాలి




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సోమవారం సంగారెడ్డిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఘనాపూర్, ఈదుల నాగులపల్లి, కర్దనూరు చౌరస్తా, వెలిమల తండా ప్రాంతాల్లో 33/11 కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కోరారు. స్థలాలు అందుబాటులోకి వస్తే విద్యుత్ శాఖ ద్వారా పరిపాలనా అనుమతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఇస్నాపూర్‌లో నూతన పోలీస్ స్టేషన్ మంజూరైన నేపథ్యంలో శాశ్వత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 496లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతంలో స్థలం కేటాయించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్ నిర్మించాలని కోరారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం కేటాయించిన సర్వే నంబర్ 203లోని 145 ఎకరాల్లో సుమారు 25 ఎకరాల మిగులు భూమిని స్థానిక ప్రజల అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే కోరారు. మోడల్ మార్కెట్‌తో పాటు హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశానవాటికలకు స్థలాలు కేటాయించాలని సూచించారు. అర్హులైన జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు అంశాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బీవీఆర్ఐటీలో ఘనంగా ఎం.టెక్ ఫ్రెషర్స్ ఇండక్షన్ కార్యక్రమం




**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** బీవీఆర్ఐటీ నర్సాపూర్ ప్రాంగణంలో ఎం.టెక్ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె. విష్ణు రాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశ్రమలతో అనుసంధానమై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు, బీవీఆర్ఐటీ పూర్వ విద్యార్థుల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పలు ప్రముఖ పరిశ్రమలు, ఈవీటీ టెక్నాలజీస్, ఇంజినీరింగ్ డిజైన్ సంస్థలతో బీవీఆర్ఐటీ అకడమిక్--ఇండస్ట్రీ భాగస్వామ్యాలను కొనసాగిస్తోందని తెలిపారు. ఈ భాగస్వామ్యాల ద్వారా ఎం.టెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని ప్రముఖ ఐఐటీలతో పరిశోధన, అకడమిక్ సహకారం కొనసాగిస్తున్నామని, ఆధునిక పరిశోధనా ప్రయోగశాలలు, ఇతర సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. గౌరవ అతిథి రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య ప్రాధాన్యతను వివరించారు. పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ పరిశోధనలతో పాటు అకడమియా--పరిశ్రమల మధ్య బలమైన సంబంధాలను ఏర్పరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, ఇండస్ట్రీ రిలేషన్స్ అసోసియేట్ డైరెక్టర్ డా. వంశీకృష్ణ, అకడమిక్ డీన్ డా. మురళీకృష్ణ పాల్గొన్నారు. వివిధ విభాగాధిపతులు, డీన్లు, పీజీ కోఆర్డినేటర్లు, ఎం.టెక్ నూతన విద్యార్థులతో పాటు డీజీఎం కాంతారావు, కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు హాజరయ్యారు.

# తూప్రాన్--నర్సాపూర్ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్

- మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు
- ఎస్సై మధుకర్ రెడ్డి

**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తూప్రాన్--నర్సాపూర్ ప్రధాన రహదారిపై ఎస్సై మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు చేపట్టిన తనిఖీల్లో ఓ వాహనదారుడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో అతడికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సదరు వ్యక్తి కోర్టుకు హాజరై, న్యాయస్థానం విధించే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, వాహనదారులు నిబంధనలు పాటించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు సూచించారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు మహేందర్, శేఖర్, రమేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# దౌల్తాబాద్ ప్రాథమిక పాఠశాలలో దొంగల హల్‌చల్

**తాళం పగలగొట్టి గ్యాస్ సిలిండర్, ఫ్యాన్, వంట సామగ్రి అపహరణ**




**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** దౌల్తాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని వంట సామగ్రి గది తాళం పగలగొట్టి లోపల ఉన్న గ్యాస్ సిలిండర్‌తో పాటు సీలింగ్ ఫ్యాన్, పలు వంట సామగ్రిని అపహరించినట్లు పాఠశాల హెచ్‌ఎం సాజిదా బేగం తెలిపారు. ఈ ఘటనను గుర్తించిన వెంటనే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. పాఠశాలలో కంప్యూటర్లు కూడా ఉన్నాయని, వాటి భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో పాఠశాలకు భద్రత లేకపోవడంతో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను హెచ్‌ఎం సాజిదా బేగం కోరారు. పాఠశాలలో భద్రతా చర్యలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం..!!

- బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యం
- సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, వైద్యం కోసం పోరాటం
- భూపాలపల్లి జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం : పూతల నవీన్

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణలో బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర' కొనసాగుతోంది. యాత్రలో భాగంగా భూపాలపల్లి జిల్లా పార్టీ ముఖ్య నాయకుడు పూతల నవీన్ పాల్గొని మద్దతు తెలిపారు. బహుజనులు కేవలం ఓటు వేసే వర్గంగా కాకుండా.. రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా, పాలకులుగా ఎదగాలన్న లక్ష్యంతో ఈ యాత్ర సాగుతోందని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, ఉచిత నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, భూమి, మెరుగైన వైద్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశంగా తెలిపారు. సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి స్పందన లభిస్తోందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పూతల నవీన్ మాట్లాడుతూ.. బహుజనుల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సాగుతున్న ఈ యాత్ర తెలంగాణ రాజకీయాల్లో మార్పుకు దారితీస్తుందని అన్నారు. భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేస్తామని, బహుజనుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బహుజన ప్రజాసంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మంథని నియోజకవర్గానికి రూ.12.58 కోట్ల నిధులు

- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- మంథని నియోజకవర్గ అభివృద్ధికి మరో ముందడుగు
- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అభివృద్ధి పనులకు ఆమోదం
- నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు



Annexure-I
VO BUILDINGS IDENTIFIED DETAILS,(3rd)
JAYASHANKAR BHUPALPALLY DISTRICT

| Sl. No | Constituency | Name of the Mandal | GP Name |
| --- | --- | --- | --- |
| 1 | Mulugu | Bhupalpally | Subbakkapalli |
| 2 | | Bhupalpally | Ramnayak thanda |
| 3 | Manthani | Malharrao | Chinnathundla |
| 4 | | Malharrao | Advalapalli |
| 5 | | Mutharam Mahadevpur | Mahamutharam |
| 6 | | Mutharam Mahadevpur | Nallagunta Meenajipeta |
| 7 | | Mutharam Mahadevpur | Mahabubpalli |
| 8 | | Mutharam Mahadevpur | Reddipalli |
| 9 | | Mahadevpur | Enkapalli |
| 10 | | Mahadevpur | Peddampeta |

District Collector
Jayashankar Bhupalpally



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐదు మండలాల్లో గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరయ్యాయి. వి.బి. గ్రామ జి 2026--27 (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద కాటారం, మహాముత్తారం, మహదేవ్‌పూర్, మల్హర్‌రావు, పలిమెల మండలాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వయం సహాయక మహిళా సంఘాల (వీఓ) భవనాల నిర్మాణానికి మొత్తం రూ.12.58 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి క్యాంపు కార్యాలయం వెల్లడించింది. ఈ నిధులను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

**గ్రామపంచాయతీ భవనాలకు రూ.1.20 కోట్లు**

నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు కేటాయించారు. మహాముత్తారం మండలంలోని రెడ్డిపల్లి, ప్రేమ్‌నగర్, రేగులగూడెం గ్రామాలకు, మల్హర్‌రావు మండలంలోని ఇప్పలపల్లి, ఎడ్లపల్లి, నాచారం గ్రామాలకు ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

**అంగన్‌వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు**

పిల్లలకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.2.88 కోట్ల నిధులు కేటాయించారు. కాటారం, మహదేవ్‌పూర్, మల్హర్‌రావు, మహాముత్తారం మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో భవనానికి రూ.12 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కాటారం మండలంలో మద్దులపల్లి, కాటారం, ఎర్రగుంటపల్లి, కాటారం సెంటర్--3, బయ్యారం, మల్లారం, గంగారం, గట్లకుంట, గొల్లపల్లి, సుందర్రాజ్‌పేట, గోపాల్‌పూర్, గుమ్మళ్లపల్లి, చింతకాని తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నారు. మహదేవ్‌పూర్ మండలంలో మహదేవ్‌పూర్, సూరారం, మల్హర్‌రావు మండలంలో తాడిచెర్ల, వల్లెంకుంట, ఎడ్లపల్లి ప్రాంతాల్లోనూ అంగన్‌వాడీ భవనాలకు నిధులు కేటాయించారు. మహాముత్తారం మండలంలోని గజారాంపల్లి, ఆంజనేయపల్లి ప్రాంతాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

**మహిళా సంఘాల భవనాలకు రూ.1 కోటి**

మహిళా స్వయం సహాయక సంఘాల (వీఓ) కార్యకలాపాలకు అనుకూలమైన వసతులు కల్పించేందుకు నూతన భవనాల నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరయ్యాయి. మహాముత్తారం, మహదేవ్‌పూర్, పలిమెల మండలాల్లోని పలు గ్రామాలకు ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

**ఇప్పటికే రూ.7.50 కోట్లతో పలు భవనాలకు మంజూరు**

ఇదే పథకం కింద ఐదు మండలాల్లో ఇప్పటికే రూ.7.50 కోట్ల నిధులతో నూతన మహిళా సంఘాల (వీఓ) భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కాటారం మండలంలో 24 గ్రామాలకు రూ.2.40 కోట్లు, మహాముత్తారం మండలంలో 19 గ్రామాలకు రూ.1.90 కోట్లు, మహదేవ్‌పూర్ మండలంలో 11 గ్రామాలకు రూ.1.10 కోట్లు, మల్హర్‌రావు మండలంలో 15 గ్రామాలకు రూ.1.50 కోట్లు, పలిమెల మండలంలో 6 గ్రామాలకు రూ.60 లక్షలు కేటాయించారు.

**అభివృద్ధికి మరింత ఊతం..**

ఐదు మండలాల్లో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి రావడంతో వారి కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించనుంది. నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పోషకాహారమే బలమైన భవిష్యత్తుకు పునాది : సర్పంచ్ సరిత

- పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం
- గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి
- చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ మాస కార్యక్రమాలు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సరిత ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరిత మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్యమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని అన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం నుంచి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో చిన్నారులు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని పోషకాహారం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను చిన్ననాటి నుంచే అలవరచుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సంబంధిత సేవలపై కూడా కార్యక్రమంలో అవగాహన కల్పించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం తమ వంతు బాధ్యతగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శ్రీకళ, గ్రామ కార్యదర్శి స్వాతి, అంగన్వాడీ చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరాహి బాంకెట్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** పట్టణంలోని మకుట అరుణ ఆర్కేడ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వరాహి బాంకెట్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పట్టణ ప్రముఖులతో కలిసి పాల్గొని, బాంకెట్ హాల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభమైన వరాహి బాంకెట్ హాల్ ప్రజలకు అందుబాటులోకి వచ్చి వివిధ శుభకార్యాలకు చక్కని వేదికగా నిలవాలని పృథ్వీరాజ్ ఆకాంక్షించారు. నిర్వాహకులు రాబోయే రోజుల్లో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్, ప్రకాష్, అమరేందర్, మతిన్, సోమశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం విద్యారంగంలో విప్లవాత్మక అడుగు

రూ.21.65 కోట్లతో అధునాతన విద్యాసంస్థలు

ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆధునిక విద్యాబోధన

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05:** బొల్లారం డివిజన్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం డివిజన్‌లో పలు విద్యాభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. క్యూర్ అర్బన్ రీజియన్ స్కూల్స్‌లో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో రూ.19.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన పాఠశాల భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ పాఠశాలలో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధనతో పాటు విద్యార్థులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అలాగే రూ.90 లక్షల నిధులతో ఆదర్శ బాలికల పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రూ.1.65 కోట్లతో నిర్మించిన ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని బల్దియా పరిధిలో రూ.365 కోట్ల నిధులతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ రాజు, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కుమ్మర కుటుంబాలకు ఆర్థికంగా ప్రభుత్వం చేయూతనివ్వాలి

మట్టి పాత్రలకు ప్రభుత్వ విభాగాల్లో ప్రాధాన్యత కల్పించాలి

పెబ్బేరు మండల కుమ్మర సంఘం.అధ్యక్షులు సూర్యవంశం హర్షవర్ధన్

యూత్ అధ్యక్షులు సూర్యవంశం సురేష్




**వనపర్తి. అక్టోబర్ 05 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (౧=ఖూ) అధ్యక్షులునడికుడి జయంత్ రావు,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద పిలుపుమేరకు వనపర్తి జిల్లా. కుమ్మర సంఘం అధ్యక్షులు సుగురు రాములు. ప్రధాన కార్యదర్శి. సూర్యవంశం పరుశరాముడు. పిలుపుమేరకు. పెబ్బేరు మండలంలో వివిధ గ్రామాలలో కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ, పెబ్బేరు మండల కుమ్మర సంఘం అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్ధన్. యూత్ అధ్యక్షుడు సూర్యవంశం సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం ఎంపీడీవో వెంకటేశ్వర్లు కు అందజేశారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కుమ్మరి వృత్తిదారులకు ప్రధానంగా అవసరమైన బంకమట్టిని సేకరించడం, రవాణా చేసుకోవడం ప్రస్తుతం భారంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం బంకమట్టిని ఉచితంగా అందించడంతో పాటు, గ్రామాలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని అన్నారు. యూత్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ. వృత్తిదారులు తయారు చేస్తున్న మట్టి కుండలు,ప్రమిదలు, దీపాలు, కూజాలు,మట్టి గణపతి విగ్రహాలు తదితర సంప్రదాయ వస్తువులకు ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు, ఇచ్చి ప్రభుత్వం కుమ్మరలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో. మండల యూత్ ప్రధాన కార్యదర్శి ఎన్కిచర్ల శ్రీనివాసులు. ప్రచార కార్యదర్శి ధర్మ తేజ. కుమ్మరి కుల బంధువులు కుమ్మరి శ్రీరాములు. రాజు. వెంకటేష్. ప్రజలు పాల్గొన్నారు

# ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు

సింగరేణికి ఆయన సేవలు అమూల్యం

డీసీసీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

**మందమర్రి, అక్టోబరు 5 (క్రైమ్ మిర్రర్):** కార్మిక నేతగా సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారికి పెన్షన్ పథకం అమలుకు మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ 'కాకా' జి.వెంకటస్వామి చేసిన సేవలు అమూల్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరెడ్డి, క్యాతనపల్లి పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ కొనియాడారు. కాకా వెంకటస్వామి 97వ జయంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. 1996-99 కాలంలో తీవ్ర నష్టాల్లో ఉన్న సింగరేణిని ఆదుకునేందుకు కేంద్ర మంత్రిగా ఉన్న కాకా వెంకటస్వామి ఎన్టీపీసీ నుంచి రూ.420 కోట్ల వడ్డీ లేని రుణాన్ని ఇప్పించారన్నారు. కార్మికులకు ప్రోత్సాహకాలు అందించి సంస్థను లాభాల బాట పట్టించారని, లక్షలాది మంది ఉద్యోగాలను కాపాడారని గుర్తుచేశారు. గనుల్లో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందించాలని పోరాడారని, పార్లమెంటులో బిల్లు ఆమోదింపజేసి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించారని తెలిపారు. రూ.30 కోట్లతో మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, సీసీ నర్సాపూర్ ప్రాంతాలకు గంగా జలాల తాగునీటి పథకాన్ని అందించారన్నారు.పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ..సామాన్య తాపీ మేస్త్రీగా జీవితం ప్రారంభించిన కాకా, హైదరాబాద్‌లో వేలాది మంది పేదలకు నీడ కల్పించారని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు కళాశాలలు



నెలకొల్పి ఎంతో మందిని విద్యావంతులను చేశారని పేర్కొన్నారు.

**వారసుల నాయకత్వంలో అభివృద్ధి..**

కాకా వెంకటస్వామి ఆశయాలకు అనుగుణంగా ఆయన వారసులు, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పనిచేస్తున్నారని నాయకులు కొనియాడారు. గిగ్, ప్రైవేటు కార్మికుల సంక్షేమానికి మంత్రి వివేక్ చట్టం తెచ్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రామకృష్ణాపూర్ ఎంకే4 ఓసీ, తాడిచర్ల గనులకు అనుమతులు సాధించి సింగరేణి ప్రయోజనాలు కాపాడారని తెలిపారు. నిరుద్యోగ యువతకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచేందుకు ఎంపీ వంశీకృష్ణ పోరాడుతున్నారని తెలిపారు. అనంతరం స్థానిక భగత్ సింగ్ నగర్ హాట్స్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణిలో తొలిసారి ఆయిల్‌పామ్ తోట

మందమర్రి ఏరియాలో 2 హెక్టార్లలో 285 మొక్కలు




**మందమర్రి అక్టోబర్ 5 (క్రైమ్ మిర్రర్ ):** గని భూములను సద్వినియోగం చేసేందుకు సింగరేణి యాజమాన్యం కొత్త అడుగు వేసింది. సంస్థ చరిత్రలో తొలిసారిగా బొగ్గు గని భూముల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి శ్రీకారం చుట్టింది. మందమర్రి ఏరియాలోని మూసివేసిన కె.కె.-2 భూగర్భ గని ఆవరణలో 2 హెక్టార్లలో 285 ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు.సీ అండ్ ఎండీ డాక్టర్ బుధ ప్రకాశ్ జ్యోతి దిశానిర్దేశంలో, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు, జీఎం (ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్) బి. సైదులు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది, కుటుంబ సభ్యులు మొక్కలు నాటారు.గని భూముల పునరుద్ధరణతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇతర గని ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.




## రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మురళి కృష్ణ కి సన్మానం

**ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు**

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఘనంగా సన్మానం చేశారు. మురళీకృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం నా యొక్క బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థుల కోసం ఇంకా బలమైన ఉద్యమాలు నిర్వహిస్తానని, మండలం విద్యార్థులు, జిల్లా విద్యార్థుల సహకారం ప్రోత్సాహంతో బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి అన్నేపాక అనిల్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి వెంకటాచారి, మండలం నాయకులు ప్రేమ్ కుమార్, అజయ్, నందు, మహేష్, విగ్నేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## దసరా, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**ఏరియా జీఎం రాధాకృష్ణ ఆదేశం**

**అధికారులు, ఏఐటీయూసీ నాయకులతో సమీక్ష**

**మందమర్రి,అక్టోబర్ 5 క్రైమ్ మిర్రర్:** మందమర్రి సింగరేణి ఏరియా పరిధిలో ఫ్యామిలీ డే ఆట పాటలు, సద్దుల బతుకమ్మ, రామలీల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా పక్కా ఏర్పాట్లు చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. జీఎం కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏరియా ఉన్నతాధికారులు, గుర్తింపు సంఘం నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... ఉత్సవాల వేళ అన్ని ప్రధాన కేంద్రాల్లో కంటికింపైన విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకల రోజున బతుకమ్మ ఆడటానికి వచ్చే మహిళలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేడుకలు జరిగే రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియం, మందమర్రి సింగరేణి హైస్కూల్ మైదానం, సోమగూడెం గ్రౌండ్, బెల్లంపల్లి ఏఎంసీ ప్రాంగణాలను ముందుగానే శుభ్రం చేసి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. విజయదశమి పురస్కరించుకుని నిర్వహించే రామలీల కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్.ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మురళి, డీజీఎం (సివిల్) మదీనా భాష, ఏఎస్ఓ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ పీఓ సత్యనారాయణ, వర్క్‌షాప్ ఎస్ఈ నరేష్‌తో పాటు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ (మందమర్రి), దాగం మల్లేష్ (బెల్లంపల్లి), అక్బర్ అలీ (రామకృష్ణాపూర్) తదితరులు పాల్గొన్నారు.



# సొంత గ్రామంలో మహిళా సర్పంచ్‌పై వేధింపులు ఆపలేని యాదయ్య గౌడ్‌కు రాష్ట్ర సర్పంచుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది?

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్**



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** "సర్పంచులపై ఎమ్మెల్యేల వేధింపులు సాగనివ్వం.. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అంటూ తెలంగాణ సర్పంచుల సంఘం జేపీసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా చెప్పుకునే సుర్వి యాదయ్య గౌడ్ మీడియా ముందు పెద్దపెద్ద ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. సర్పంచుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిగా చెప్పుకునే యాదయ్య గౌడ్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ముందుగా తన సొంత గ్రామమైన అల్లందేవిచెరువు గ్రామపంచాయతీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా సర్పంచ్ శ్రీమతి సుర్వి సౌజన్య రాజు గౌడ్ ఎదుర్కొంటున్నట్లు చెబుతున్న రాజకీయ వేధింపులపై ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. యాదయ్య గౌడ్ ముఖ్య అనుచరుడిగా పేర్కొంటున్న సుర్వి లింగస్వామి మహిళా సర్పంచ్‌ను ఇబ్బందులకు గురిచేస్తూ, ఆమె ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ యాదయ్య గౌడ్ మౌనం వహించడం వెనుక కారణం ఏమిటని దేవేందర్ యాదవ్ నిలదీశారు.సర్పంచ్ కార్యాలయంలో లేని సమయంలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం సమర్పించడం, గ్రామంలో మురుగునీరు నిలవకుండా గతంలో ఏర్పాటు చేసిన అత్యవసర కాలువను మట్టితో పూడ్చివేసి ఆ నెపాన్ని సర్పంచ్‌పై మోపడం, గాంధీ జయంతి సందర్భంగా జరిగిన గ్రామసభలో మహిళా సర్పంచ్‌ను ఉద్దేశించి దుర్భాషలాడినట్లు ఆరోపణలు రావడం వంటి ఘటనలపై యాదయ్య గౌడ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "రాష్ట్రంలో ఎక్కడో ఒక సర్పంచ్‌పై ఒత్తిడి వస్తే వెంటనే మీడియా ముందుకు వచ్చి మాట్లాడే యాదయ్య గౌడ్.. తన సొంత గ్రామంలో ఒక మహిళా ప్రజాప్రతినిధి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదు? మాటల్లో సర్పంచుల హక్కుల పరిరక్షకుడిగా కనిపిస్తూ, చేతల్లో మాత్రం సొంత గ్రామంలోని మహిళా సర్పంచ్ సమస్యపై మౌనం వహించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనం" అని దేవేందర్ యాదవ్ ధ్వజమెత్తారు. సర్పంచుల హక్కులపై నిజమైన గౌరవం, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల బాధ్యత ఉంటే, ముందుగా తన సొంత గ్రామంలోని సమస్యపై స్పందించాలని ఆయన సూచించారు. మహిళా సర్పంచ్‌ను వేధిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తన అనుచరుడిని మందలించి, ఆమె గౌరవం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. సొంత గ్రామంలోని మహిళా సర్పంచ్ సమస్యపై స్పందించలేని వ్యక్తి రాష్ట్రంలోని సర్పంచుల సమస్యలపై చేసే ప్రకటనలకు ప్రజల్లో విశ్వసనీయత ఉండదని దేవేందర్ యాదవ్ స్పష్టం చేశారు. ఇకనైనా కపట రాజకీయాలు, మాటలకే పరిమితమైన ప్రకటనలు మానుకుని.. సొంత గ్రామంలోనే ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు యాదయ్య గౌడ్ ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం**




**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ అంకితభావంతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బెట్టగూడెం ఎస్జీటీ టి. ప్రమీల, జడ్పీహెచ్ఎస్ సోమారం తెలుగు సహోపాధ్యాయులు ధనావత్ హరీష్ నాయక్ లను లిలిశ్రీ శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.లయన్స్ క్లబ్ నేరేడుచర్ల అధ్యక్షులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ బట్టు మధు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. భావితరాన్ని తీర్చిదిద్దడంలో, దేశ అభివృద్ధికి అవసరమైన ఉత్తమ విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, బాల వెంకటేశ్వర్లు, జీఎంటీ కోఆర్డినేటర్ లాయర్ విశ్వనాథం, అడ్వైజరీ కమిటీ చైర్పర్సన్ రాచకొండ విజయలక్ష్మి, అరుణకుమారి, డీపీఓ ప్రణతి, అడ్వైజరీ కమిటీ సభ్యులు కొప్పు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించి గౌరవించడం ఎంతో స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు.

# అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.2,00,016 విరాళం





**భక్తి చాటుకున్న కుతాడి ప్రభాకర్:** పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 05: బీరంగూడ గుట్టపై నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి బీరంగూడ గ్రామానికి చెందిన కుతాడి ప్రభాకర్ భక్తిశ్రద్ధలతో రూ. 2,00,016 విరాళంగా సమర్పించారు. ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం భక్తుల సహకారంతో శరవేగంగా కొనసాగుతోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణం, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా భావాన్ని చాటుతూ ప్రభాకర్ అందించిన విరాళం ఇతరులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.బీరంగూడ గుట్టపై నిర్మిస్తున్న నూతన అయ్యప్ప స్వామి ఆలయం భవిష్యత్‌లో భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలనుకునే భక్తులు, దాతలు తమకు తోచిన విధంగా సహకారం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కుతాడి ప్రభాకర్ కుటుంబ సభ్యులకు శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# రాచకొండ భూముల సమస్యలు పరిష్కరించాలి

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్**

**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి**

**క్రైమ్ మిర్రర్ సంస్థాన్ నారాయణపురం:-** రాచకొండ రెవెన్యూ ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్..జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ను కోరారు. సోమవారం రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ ను కలిశారు. సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ రెవెన్యూ పరిధిలో అటవీ రెవెన్యూ అధికారుల సమన్వయం లోపంతో సుమారు10 సంవత్సరాల నుండి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి ప్రవేశ పెట్టిన అప్పటి నుండి కొన్ని పట్టా భూములను. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు హక్కులను నిలుపుదల చేసి ఇబ్బందుల గురిచేసిందని ఆరోపించారు. సర్వేనెంబర్ 106 . 273 లో సమస్యలు ఉన్నాయని పట్టా భూములను కూడా వారి హక్కులను నిలుపుదల చేశారని కలెక్టర్ కు చెప్పారు. ఓవర్ లాప్ అని ఫారెస్ట్ రెవిన్యూ సరిహద్దుల సమస్య ఉందని చెప్పి కాలయాపన చేస్తున్నారని కలెక్టర్కు వివరించారు . చాలా రోజుల నుంచి సమస్య పరిష్కారం అవుతుందని భావించిన నేటి వరకు కాలేదని. ల్యాండ్ ను అనేకసార్లు సర్వేలు చేసి కిందిస్థాయి అధికారులు పై స్థాయికి నివేదికలు ఇవ్వడం లేదని ప్రతిసారి అధికారి మారినప్పుడల్లా సమస్య మొదటికి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా భూముల సమస్యలు పరిష్కారము అవుతాయని



రైతులు భావిస్తున్నారని. భూభారతిలో భూములను రి సర్వే చేసే దానిలో రాచకొండను సర్వే చేసి జిల్లా .సర్వే నెంబర్ల సరిహద్దులను పిక్స్ చేసి. సమస్యను పరిష్కరించి భూములపై హక్కులు కల్పించి రైతులకు పాస్ బుక్కులు జారీ చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రాచకొండ భూ సమస్యలపై తక్షణమే నివేదిక సమర్పించాలని చౌటుప్పల్ ఆర్టీవో ను ఆదేశించారు. తొందర్లోనే భూమి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జరుపుల జగన్, లక్ష్మీ సాగర్,తోటకూర శంకర్, నాయకులు సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి,జక్కలి విక్రమ్, అర్థం జనార్దన్ రెడ్డి, రైతులు భూతం యాదయ్య,లింగస్వామి, సుర్కంటి మోహన్ రెడ్డి, ముత్యాల ప్రతాప్ రెడ్డి, కాట్రోత్ రామకోటి, జరుపుల శ్రీను, భాస్కర్, వల్లపు యాదయ్య,కరెంటు రాజు, మెగావత్ రాము ఆగయ్య,సుధాకర్ రెడ్డి, బొడ్డు మల్లేష్,లచ్చు గోపి,తదితరులు పాల్గొన్నారు

# నీటి ట్యాంకర్‌ను అమ్ముకున్న సర్పంచి...?

**మూకుమ్మడిగా అధికారులకు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు**

**రూ.లక్షల పనులకు అడ్డగోలుగా ఎంబీలు?**

**చండూరు,క్రైమ్ మిరర్:** నల్గొండ జిల్లా చండూరు మండలం ఓ గ్రామ సర్పంచి ఏకంగా నీటి ట్యాంకర్ అమ్ముకోవటం...మూకుమ్మడిగా వార్డు సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేయటం చర్చనీయాంశంగా మారింది. తీర్మాణం లేకుండానే అమ్ముకోవటం అపై 15 వ ఆర్థికం సంఘం నిధులకు సంబంధించి ఖర్చు విషయంలో చేసిన పనులకు పెట్టిన బిల్లులకు సంభందం లేకుండా ఉన్నట్లుగా ఆరోపణులు గుప్పుమంటున్నాయి. ఇది ఏందని వార్డు సభ్యులు అడిగితే ఎంబీలు ఇలాగే ఉంటాయంటు దబాయిస్తుండటం? అందరిని విస్మయ పరుస్తుంది.







### ట్యాంకర్‌ను స్క్రాప్‌కు వేశారు

గ్రామ పంచాయతీకి సంబంధించి పాత నీటి ట్యాంకర్ ఉంది. అధి జంగు పట్టింది. అయితే వార్డు సభ్యులు అందరు కలిసి కొత్త ట్యాంకర్ కొనాలని తీర్మానం చేశారు. తీరా చూస్తే ట్యాంకర్‌ను 16వేలకు స్క్రాప్‌కు వేశామని వచ్చిన డబ్బును గ్రామ పంచాయతీలో జమచేశామని సర్పంచి చెప్పారు. అయితే తాము ఎక్కడ పాత ట్యాంక్‌ను స్క్రాప్‌కు వేయాలని తీర్మాణం చేయలేదని అయినా అంత ట్యాంక్‌ను అమ్మితే కేవలం 16వేలు మాత్రమే ఎలా వస్తాయంటు వార్డు సభ్యులు వాపోతున్నారు. కొత్త ట్యాంకర్‌ను రూ.2.47 లక్షలకు తీసుకొచ్చారు. దాని విలువ అంత ఉండదని అయినా సరే అది నాసిరకంగా ఉందని అపుడే లీకేజీ అవుతుందంటు వార్డు చెపుతున్నారు. పైగా పాల ట్యాంకర్ ట్రైర్లనే కొత్త ట్యాంకర్‌కు వేయటం మరీ విడ్డూరంగా మారింది.

### 10లక్షల పనుల్లో అంతా గోల్‌మాల్?

15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం 27లక్షలు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు జీతాలు గత పాలకులు ఖర్చు చేసిందంటు మొత్తం కలసి 7లక్షలు పోగా మిగిలిన 10లక్షలతో గ్రామంలో వివిద పనుల పేరుతో ఎంబీలు పెట్టారు. అయితే మోటార్లు, లైట్ల ఖర్చు విషయంలో అయ్యే ఖర్చుకు పెడుతున్న ఎంబీలకు సంభందం ఉండటం లేదని వార్డు సభ్యులు వాపోతున్నారు. ఇక జేసీబీలతో చేయించే పనులకు అంత లేని అవినీతి జరుగుతుందని వార్డు సభ్యులు చెబుతున్నారు. అన్ని దొంగ లెక్కలు రాస్తున్నారని నిధులు కాజేశారని ఎవరు ఆ బిల్లులను చూసి ఇట్టే అర్థం అవుతుందంటున్నారు వార్డు సభ్యులు. మిషన్ భగీరత పైపులైన్ తవ్వకాలు, ఇతర చిన్న చిన్న పనులకు అడ్డగోలుగా బిల్లులు రాసినట్లు తెలుస్తోంది.

### విచారణలో అన్ని తేలుతాయి...సర్పంచి సత్యం

ఈ విషయమై సర్పంచి సత్యాన్ని వివరణ కోరగా అన్ని లెక్క ప్రకారమే చేశామని ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇప్పటికే ఫిర్యాదు అధికారులకు అందటంతో విచారణకు వస్తున్నారని విచారణలో అన్ని తేలుతాయి అన్నారు.

## నిరుద్యోగుల చలో హైదరాబాద్‌కు బ్రేక్..

**బీఆర్ఎస్వీ నేత దారమోని గణేష్ ముందస్తు అరెస్ట్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** రెండు లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కల్వకుర్తి పోలీసులు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్‌ను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దారమోని గణేష్ మాట్లాడుతూ.. ముందస్తు అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని అడ్డుకోలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, యువతకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి, స్కూటీ పథకం హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు.

## లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ఏఈఓకు నారాయణపురం రైతుల వినతి**

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో వ్యవసాయానికి ఎదురవుతున్న తీవ్ర లో-వోల్టేజ్, విద్యుత్ కోతల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానిక రైతులు సోమవారం ఏఈఓ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో విద్యుత్ సరఫరాలో లో-వోల్టేజ్ సమస్య మితిమీరిపోవడంతో పంప్‌సెట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తుండటంతో, రాత్రిపూట పంటలకు నీళ్లు అందించడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశ, పాలు పోసుకునే అత్యంత కీలకమైన దశలో ఉండి నీరు అందక ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు.వెంటనే అధికారులు స్పందించి వ్యవసాయానికి అన్ని ఫేజ్‌లలోనూ నాణ్యమైన విద్యుత్‌ను 2 విడతలుగా సక్రమంగా సరఫరా చేయాలని, కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

